అధ్యాపకులను నియమించాలి: .ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- అరకు రూరల్: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకులను నియమించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎస్.ఐసుబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం అరకులోయ ఆదివాసీ గిరిజన భవనంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అరకులోయ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ప్రారంభం నుండి నేటి వరకు పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించక పోవడం దారుణమన్నారు. ఇలా అయితే గిరిజన విద్యార్థులు ఎలా చదువుకుంటారని ఆయన ప్రశ్నించారు. 600 మంది విద్యార్థినిలు విద్యను అభ్యసిస్తున్నారని, గతంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటం నిర్వహిస్తే అధ్యాపకులను నియమిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామి ఇచ్చి మరచి పోయారన్నారు. ఈ ఏడాది జూన్ నెలలో కళాశాల ప్రారంభమై 6 నెలలు నడుస్తున్నా ఇప్పటివరకు ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ తప్ప ఒక్క అధ్యాపకులు కూడా లేరన్నారు.గతంలో సంవత్సరం విద్యార్థినిలు పోరాటాల ఫలితంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు శిరగం చరణ్, మండల సహాయ కార్యదర్శి వంతల బలరాం పాల్గొన్నారు.

గోడు వింటూ..భరోసా కల్పిస్తూ..

- ఉత్తేజంగా సాగుతున్న ప్రజారక్షణ భేరి యాత్ర
- అడుగడుగునా అపూర్వ ఆదరణ
- ఏజెన్సీపై పాలకుల నిర్లక్ష్యం పట్ల మండిపడ్డ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పాడేరు, పాడేరు టౌన్, పెదబయలు, జి.మాడుగుల, చింతపల్లి

అల్లూరి జిల్లాలో సిపిఎం ఆధ్వర్యాన జరుగుతున్న ప్రజారక్షణ భేరి బస్సు యాత్రకు ఆదివాసీల నుంచి అపూర్వ ఆదరణ దక్కుతోంది. 'అసమానతలు లేని అభివృద్ధి కోసం' తలపెట్టిన ఆ యాత్ర గిరిజనాన్ని తట్టిలేపుతోంది. పాడేరు ఏజెన్సీలోని ఆదివాసీల కష్టాలను తెలుసుకుంటూ.. వారికి భరోసా కల్పిస్తూ ఈ యాత్ర సాగుతోంది. శుక్రవారం ముంచంగిపుట్టు నుంచి పెదబయలు, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి ప్రాంతాల్లో ఈ యాత్ర పర్యటించింది. ఎక్కడికక్కడ ఈ యాత్రకు ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. తిలకం దిద్ది సంప్రదాయబద్ధంగా యాత్రా బృందాన్ని ప్రజలు తమ ప్రాంతాలకు ఆహ్వానించారు. గిరిజన యువతుల థింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి. యువకులు డప్పు వాయిద్యాలతో హోరెత్తించారు. పాడేరులో భారీ ర్యాలీ చేపట్టారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదికపై ప్రజానాట్య మండలి కళాకారుల ప్రదర్శనలు చైతన్యం నింపాయి. పలువురిని ఆలోచింపజేశాయి.

పలుచోట్ల జరిగిన సభల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏజెన్సీలో కాఫీ, మిరియాల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైందన్నారు. కిలో కాఫీ గింజలను రైతులు రూ.250కి అమ్ముకోవాల్సి వస్తోందని, దీంతో నష్టమే మిగులుతోందని తెలిపారు. ప్రజా ప్రతినిధులకు ప్రజల పట్ల జవాబుదారీతనం ఉండాలన్నారు. నిరంతరం ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకునే కమ్యూనిస్టులకు ఆదివాసీలు ఎన్నికల్లో అండగా నిలవాలన్నారు. నేటికీ అనేక ప్రాంతాల్లో గిరిజనులకు విద్య, వైద్యం, రవాణా సేవలు అందుబాటులో లేవని ఆవేదన చెందారు. పివిటిజిలకు అంత్యోదయకార్డులను సైతం ప్రభుత్వం మంజూరు చేయలేదన్నారు. అనేక గ్రామాల్లో పాఠశాలల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని తెలిపారు. ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల కోసం వందల ఎకరాల భూమిని అప్పగించడం దారుణమన్నారు. గిరిజనులకు నష్టం చేకూర్చే చర్యలను సహించబోమన్నారు. ఎస్సీ, ఎస్టీల ఆత్మగౌరవం ఇనుమడించే విధంగా ఏమిచ్చారని సాధికారత అంటున్నారని ఇటీవల పాడేరులో వైసిపి జరిపిన సామాజిక సాధికార బస్సు యాత్రను ఉద్దేశించి ఆయన ఎద్దేవా చేశారు. మోడీ తొమ్మిదేళ్ల తన పాలనలో రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టూ ఇవ్వలేదన్నారు.

ఆలోచింపజేసిన నేతల ప్రసంగాలు

సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ ఏజెన్సీలో సాగునీటి ప్రాజెక్టుల కోసం ప్రభుత్వాలు ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదన్నారు. వర్షాలు లేక భవిష్యత్తులో కరువు పరిస్థితులు నెలకొనే పరిస్థితి ఉందన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ అభివృద్ధిలో అసమానతలకు గిరిజనుల దుస్థితే నిదర్శనమని అన్నారు. ఆదివాసీల పట్ల ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని తెలిపారు. అనాదిగా అడవిని కాపాడుతున్నది గిరిజనులేనని గుర్తుచేశారు. జిఒ నెంబర్ 3 రద్దుతో గిరిజనులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయారని తెలిపారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు అశోక్ మాట్లాడుతూ ఏజెన్సీలో ఉన్నత విద్యా అవకాశాలను ప్రభుత్వం పెంపొందించడం లేదన్నారు. పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ అల్లూరి జిల్లా అభివృద్ధి కోసం ప్రభుత్వం చేసిన ప్రణాళికలు ఏమిటని ప్రశ్నించారు. ఏజెన్సీలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం లేదని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్ల కొరత నెలకొందని అన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి హైమావతి మాట్లాడుతూ గిరిజన మహిళల పట్ల ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయన్నారు. యాత్రలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం.సూర్యనారాయణ, సిపిఎం జిల్లా నాయకులు బి.చిన్నయ్యపడాల్, ఎల్.సుందరరావు, పాలికి లక్కు, సాగిన ధర్మాన్న పడాల్, వనుగు సన్యాసి దొర, బి.సన్నిబాబు, శరభన్న, రామారావు, గంగాధరం, ధనుంజయ్, సాగిన చిరంజీవి, జీవన్‌కృష్ణ పాల్గొన్నారు.

సౌకర్యాల పరిశీలన

పాడేరులో రూ.500 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాలను వి.శ్రీనివాసరావు పరిశీలించారు. పనుల్లో జాప్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే పెదబయలు మండలంలోని రోగుల గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. చిన్నారులను ఎక్కాలు, పద్యాలుపై ప్రశ్నలు వేసి పరీక్షించారు. ఐదో తరగతి చదువుతున్న ప్రశాంత్ ప్రపంచ దేశాలు, వాటి రాజధానులు, మరొక

పాఠశాల విద్యార్థులతో వి.శ్రీనివాసరావు

పాడేరు సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

విద్యార్థి గ్రేసీ దేశంలోని రాష్ట్రాలు, వాటి రాజధానుల గురించి చెప్పారు. సంకోచం లేకుండా సమాధానాలు ఇచ్చిన విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం పాఠశాల భవనాలను పరిశీలించారు. భవనాల దుస్థితిపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యాన్ని దుయ్యబట్టారు.

చోడితోప అల్పాహారం

ప్రజారక్షణ భేరి బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం ఉదయం పెదబయలు మండల కేంద్రానికి సమీపంలోని రోగుల గ్రామానికి విచ్చేసిన వి.శ్రీనివాసరావు, యాత్రా బృందం సభ్యులకు సిపిఎం మండల కార్యదర్శి బి.సన్నిబాబు తమ గ్రామంలో చోడితోపను అల్పాహారంగా వడ్డించారు. గిరిజనుల ప్రత్యేక వంటకమైన దీన్ని అడ్డాకు దొప్పలలో పెట్టి వెదురుతో చేసిన స్పూన్లను ఇచ్చి ప్రత్యేక ఆతిథ్యమిచ్చారు.

నాయకుల ప్రసంగాలను ఆసక్తిగా వింటున్న ఆదివాసీలు

వినతుల వెల్లువ

పాడేరులో స్కీమ్ వర్కర్లు, పివిటిజి గిరిజనులు, కాఫీ కార్మికులు తమ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. జి.మాడుగులలో గెమ్మెలి పంచాయతీ చిన్న కొత్తూరు గ్రామంలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని, స్పెషల్ డిఎస్‌సి వచ్చేలా చూడాలని, విఒఎల సమస్యలు పరిష్కరించాలని పలువురు విజ్ఞప్తులు చేశారు.

నేడు ఎఎస్ఆర్ రంపచోడవరంలో..

రంపచోడవరం : 'అసమానతలు లేని అభివృద్ధి కోసం' సిపిఎం ఆధ్వర్యాన తలపెట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లాలోకి శనివారం ప్రవేశించనుంది. గత నెల 30న పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట వద్ద ప్రారంభమైన ఈ యాత్ర విజయనగరం, అల్లూరి జిల్లాలను దాటుకుంటూ రంపచోడవరం ఏజెన్సీలోకి ప్రవేశించనుంది. ఇప్పటికే ఆదివాసీలను వారి సమస్యల పరిష్కారం దిశగా కదిలిస్తూ, వారిలో చైతన్యం రేకెత్తిస్తూ సాగుతున్న ఈ యాత్రకు ఎక్కడికక్కడ ఘన స్వాగతం లభిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ బస్సు యాత్ర శనివారం కొయ్యూరు మండల కేంద్రంలో ప్రారంభమవుతుంది. అనంతరం రంపచోడవరం ఏజెన్సీలోని రాజవొమ్మంగికి ఉదయం 11 గంటలకు చేరుకుంటుంది. ఆ తరువాత అడ్డతీగల, రంపచోడవరం మండలాల్లో పర్యటిస్తుంది. ప్రజల కష్టాలను ఈ సందర్భంగా యాత్రా బృందం తెలుసుకోనుంది. 5న మారేడుమిల్లి, చింతూరు, విఆర్.పురం, కూనవరం మండలాలగుండా సాగి ఏలూరు జిల్లాలోకి ప్రవేశిస్తుంది. పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం అనేక పోరాటాలు నడపడం, ఈ ప్రాంతంలో ఆ పార్టీకి బలమైన పునాది ఉండటం, ఆదివాసీలకు ఎర్రజెండాపై ఉన్న నమ్మకం.. ఇత్యాదివన్నీ కలిసి ఈ యాత్రకు భారీ స్పందన లభించే అవకాశముంది. శనివారం రంపచోడవరం ఏజెన్సీలోని పలు మండలాల్లో జరిగే సభల్లో యాత్ర రథసారథి వి.శ్రీనివాసరావు ప్రసంగించనున్నారు. యాత్రను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రాంబాబు, వాణిశ్రీ, పల్లపు వెంకట్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా బస్సు యాత్ర ఏర్పాట్లును పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

జిసిసి సూపర్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఎమ్‌డి సురేష్ కుమార్

నాణ్యమైన సరుకులు విక్రయం

- జిసిసి ఎమ్‌డి జి.సురేష్ కుమార్

ప్రజాశక్తి-రంపచోడవరం

జిసిసి ద్వారా నాణ్యమైన సరుకులు విక్రయించాలని ఆ సంస్థ ఎమ్‌డి జి.సురేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. రంపచోడవరంలోని పసుపు, చింతపండు ప్రాసెసింగ్ యూనిట్, జిసిసి షీకాయ్ యూనిట్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. షీకాయ్ యూనిట్‌లో కొత్త మిషనరీ కొనుగోలుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపించాలని ఆదేశించారు. ఎంఎల్ఎస్ గోదాము మరమ్మతులే చేపట్టాలన్నారు. అనంతరం రంపచోడవరం మెయిన్ రోడ్డులోని జిసిసి సూపర్ బజార్‌ను, తరువాత మారేడుమిల్లి సొసైటీలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ని సందర్శించారు. గోడౌన్ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం జిసిసి డివిజన్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, మారేడుమిల్లి సొసైటీ మేనేజర్ ఎమ్.రాజారెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బోరు బావి ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నేత ఐవి

సిపిఎం కృషితో

బూరుగువాయిలో బోర్లు ఏర్పాటుకు అంగీకారం

ప్రజాశక్తి - ఎటపాక

మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ పరిధి బూరుగువాయి గ్రామంలో బోర్లు ఏర్పాటుకు సచివాలయ కార్యదర్శి, పంచాయతీ సర్పంచ్ అంగీకరించారు. ఈ గ్రామంలో రెండు నెలల క్రితం హైవే రోడ్డు పనుల నిర్మాణం వలన మంచి నీటి పైపులైను పగిలిపోవడంతో గ్రామంలోని గిరిజనులకు తాగునీరు లేక వారు నానా అవస్థలు పడుతున్నారు. హైవే రోడ్డు నిర్మించే వాళ్ల గాని, స్థానిక సచివాలయ అధికారులుగాని ఈ సమస్యను పరిష్కరించలేదు. ఈ విషయం సిపిఎం మండల నాయకత్వం దృష్టికి రాగా, వెంటనే ఆ గ్రామాన్ని సందర్శించారు. గ్రామానికి వెంటనే మంచినీళ్లు అందించకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. దీనికి స్పందించిన సచివాలయం కార్యదర్శి, పంచాయతీ సర్పంచి హుటాహుటిన వచ్చి బోర్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు చూపించిన చోట బోరు పాయింట్లను పెట్టారు. మంచినీటి బోర్లు మంజూరు కావడానికి సహకరించిన సిపిఎం నాయకత్వాన్ని గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఐ.వి, నాయకులు ఆకిశెట్టి రాము, సవలం రాము, జి.హుస్సేన్ పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న వైస్ ఎంపిపి, గిరిజనులు

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండలంలో కించాయిపుట్టు పంచాయతీలోని పలు గ్రామాల్లో నిలిచిన రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడ్డిబంద, మర్రిపుట్టు, అడలపుట్టు, వారుకుగుమ్మి, తేనెల మామిడితో పాటు కుమడ, దోడిపుట్, బిడిచంప గ్రామాల్లో రోడ్లకు నిధులు విడుదల అయినప్పటికీ పనులు చేపట్టలేదన్నారు. రోడ్డు సౌకర్యం లేక అత్యవసర వైద్య సేవలు అందక గిరిజనులు అవస్థలు పడుతున్నారన్నారు. అటవీ శాఖ అధికారులు రోడ్డు నిర్మాణాలకు నిరాకరిస్తున్నారని మండిపడ్డారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గర్భిణీలను తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎంఎం శ్రీను మాట్లాడుతూ, రోడ్డు నిర్మాణ పనులు చేపడుతుంటే ఫారెస్ట్ అధికారులు అనుమతి లేదని అడ్డుకున్నారన్నారు. రోడ్ల నిర్మాణలను అడ్డుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కిల్లో నారాయణ, కిల్లో లోబ్బో, గోల్లోరి ప్రసాద్, వంతల రమూర్తి పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని తూటంగి పంచాయితీ గేదెలబందలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. 390 మందికి వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పిటిసి బి.ఈశ్వరి, సిహెచ్ జానకమ్మ మాట్లాడుతూ, జగనన్న సురక్షతో గిరిజనులకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ప్రత్యేక వైద్య నిపుణులు గ్రామాల్లో వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య సేవలు అందించడం గొప్ప విషయమని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగ పరచుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.లలిత, ప్రత్యేక వైద్య నిపుణులు ఎన్ విజయ్‌కుమార్, వైద్య అధికారులు ప్రేమ, హెల్త్ అసిస్టెంట్లు ఎస్.ప్రభాకర్, సంజీవ్ ఎస్.స్వామి, పంచాయతీ కార్యదర్శి ఆర్.రాజ్ కుమార్, ఎం.ఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యా బోధన

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు విద్యను బోధించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు. శుక్రవారం గంగవరం మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రాజెక్ట్ అధికారి పర్యటించారు. స్టోర్ రూమ్‌ను సందర్శించి నిత్యవసర వస్తువులు ఏమేమి ఉన్నాయో రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాలన్నారు. అన్ని తరగతుల సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రాజెక్ట్ అధికారి సందర్శించి అక్కడ మహిళలతో మాట్లాడారు. వైద్య సేవలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఎవరు జ్వరంతో వచ్చినా వెంటనే

పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

రక్త పరీక్షలు చేసి మందులు అందించాలన్నారు. గంగవరంలోని జీడి మామిడి పండ్లతో డ్రింక్ తయారు చేసే యూనిట్‌ను సందర్శించి జీడిమాడి పండ్ల రసం ఏ విధంగా తయారు చేస్తున్నారో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శ్రీమన్నారాయణ, ఎంపీడీవో శ్రీనివాసరావు, వెలుగు ఏపీడి ఎ.శ్రీనివాసరావు, ఏపీఎం జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

కండిషన్ లేని బస్సులతో అవస్థలు

తరుచూ మరమ్మతులపై ప్రయాణికులు అగ్రహం

ప్రజాశక్తి -సీలేరు

విశాఖపట్నం - సీలేరు మధ్య నడిచే ఆర్టీసీ బస్సులు ఘాట్ రోడ్డులో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. కండిషన్ లేని బస్సులు ఈ మార్గంలో నడపడంతోనే ఈ పరిస్థితి దాపురిస్తోంది. విశాఖ నుండి సీలేరు వస్తున్న సీలేరు నైట్ హాల్ట్ ఆర్టీసీ బస్సు గురువారం సాయంత్రం జీకే వీధి మండలం తురపాల గెడ్డ వద్ద వచ్చే సరికి బస్సు నుండి పొగలు కమ్ముకున్నాయి. దీంతో బస్సులో ఏ ప్రమాదం జరిగిందోనని ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బస్సు డ్రైవర్ నాయుడు గమనించి వెంటనే బస్సుని నిలిపివేసి, బోనట్ పైభాగాన్ని ఓపెన్ చేసి పరిశీలించగా రేడియేటర్లో పూర్తిగా నీరు అపోయినట్లు గమనించారు. దీంతో రేటియేటర్‌లో నీటిని నింపారు. అయినప్పటికీ పొగలు తగ్గకపోవడంతో ఇంకేమైనా సాంకేతిక లోపాలు తలత్తేయా? అని క్షుణ్ణంగా పరిశీలించగా ఇంజన్ ఆయిల్ లీకై పూర్తిగా కిందికి కారిపోయినట్లు గుర్తించారు. సీలేరు బస్ ఆగిపోయిన ప్రదేశానికి కూసంత దూరంలో నర్సీపట్నం-చింతపల్లి టూ స్టాప్ బస్సు మరమ్మతులకు గురైంది. దానిని

మరమ్మతులకు గురై ఆగిపోయిన సీలేరు నైట్ హాల్ట్ బస్సు

మరమ్మతులు చేయడానికి నర్సీపట్నం ఆర్టీసీ డిపో గ్యారేజ్ నుంచి మెకానిక్ సిబ్బంది వచ్చారు. వారితో సీలేరు నైట్ హాల్ట్ బస్‌కు మరమ్మతులు చేయడానికి ప్రయత్నించినా సాధ్యపడలేదు. దీంతో విశాఖ, నర్సీపట్నం ఆర్టీసీ డిపో అధికారులకు సమాచారం ఇవ్వగా, వారు స్పందించి నర్సీపట్నం నుండి చింతపల్లి నైట్ హాల్ట్‌కు వస్తున్న టూ స్టాప్ బస్సులో సీలేరు నైట్ హాల్ట్ బస్సులోని ప్రయాణికులను రాత్రి 12 గంటలకు సీలేరు తరలించారు.

ఘాట్ రోడ్డులో కండిషన్ ఉన్న బస్సులు నడపాల్సి ఉండగా, డొక్కు బస్సులు నడపడంతో తరచూ మరమ్మతులకు గురై ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పాత అల్ట్రా డీలక్స్ బస్‌లను నైట్ సర్వీసులుగా నడపడంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నం డిపోకు చెందిన నైట్ సర్వీస్ బస్సులు అనేకసార్లు ఘాట్ రోడ్లో మరమ్మతులు గురవుతున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. అయినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి కొత్త బస్ సర్వీసులను ఘాట్ రోడ్డులో నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ సీతయ్య, ఎటిడబ్ల్యుఒ క్రాంతికుమార్

పిల్లలను బడిలో చేర్పించాలి

ప్రజాశక్తి- కొయ్యూరు

బడి బయట ఉన్న పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించాలని ఎంపీడీవో లాలం సీతయ్య, ఏటీడబ్లూవో క్రాంతి కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. బడికి హాజరవుతున్న పిల్లల స్థూల నమోదు నిష్పత్తి తదితర అంశాలపై సమీక్షించారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు తమ సచివాలయాల పరిధిలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎంతమంది పిల్లలు బడికి వెళ్లడం లేదు, బడికి వెళ్లకపోవడానికి గల కారణాలను తెలుసుకోవాలని సూచించారు.

సీలేరులో వర్షం

- రైతుల్లో చిగురించి ఆశలు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో శుక్రవారం సాయంత్రం వర్షం కురవడంతో రైతన్నల్లో ఆశలు చిగురించాయి. శుక్రవారం ఉదయం నుంచి సూర్యుడు తన ప్రతాపం చూపించగా, మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. అనంతరం ఆకాశం మేఘావృతమై ఒకసారిగా ఉరుములతో కూడిన నుంచి వర్షం కురిసింది. నెల రోజుల నుంచి సీలేరు పరిసర ప్రాంతాల్లో వర్షం లేకపోవడంతో రైతన్నల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే రాజ్‌మా, మినుములు, సామలు, కొర్రలు తదితరు పంటలు వర్షాభావం వల్లే ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఇటువంటి పరిస్థితుల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షం కొంతమేరకు పోడు వ్యవసాయానికి దోహదపడవచ్చునని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సీలేరులో కురుస్తున్న వర్షం

వినతులు స్వీకరిస్తున్న జెసి, పిఒ

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

సంయుక్త కలెక్టర్ శివ శ్రీనివాసు

ప్రజాశక్తి -అనంతగిరి:స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి విశేష లభించింది. మండలంలో పలు గ్రామాల గిరిజన ప్రజలు తమ సమస్యలను సంయుక్త కలెక్టర్ శివ శ్రీనివాసు, పిఒ అభిషేక్ విన్నవించుకున్నారు. లిఖితపూర్వకంగా వినతిపత్రాలు సమర్పించారు. రికార్డు స్థాయిలో 452 విన్నపాలు వచ్చాయి. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ శివ శ్రీనివాసు మాట్లాడుతూ, ప్రజలకు మరింత చేరువగా మెరుగైన సేవలు అందించడానికి, వారి సమస్యలు అత్యంత దగ్గరగా పరిశీలించటానికి మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం స్పందనను నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా యంత్రాంగం వచ్చినందున సమస్యకు పరిష్కారం దొరుకుతుందనే నమ్మకంతో ప్రజలు విజ్ఞాపనలు సమర్పించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రతి సమస్యపై విచారణ అధికారిని నియమించి సకాలంలో పరిష్కారం అందించాలని ఆయన ఆదేశించారు. జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులను కూడా ఎప్పటికప్పుడు పరిశీలించి తగు పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ మాట్లాడుతూ, ప్రజల నుండి అందిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదు దారులను పదే పదే కార్యాలయాలకు తిప్పించుకోవద్దని సూచించారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరిం చాలన్నారు. ఈ ఎంపిడిఓ శ్రీహర్షిత్, తహసీల్దార్ రాంబాయి, ఎంపిపి శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ దీసరి గంగరాజు, సర్పంచ్ ఎస్.రూతు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ సూర్యలక్ష్మి

బాల్య వివాహాలతో అనర్థాలు

ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి

ప్రజాశక్తి-చింతపల్లి:విద్యార్థినిలకు బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కలిగించ వలసిన బాధ్యత ఐసిడిఎస్ సిబ్బందితోటు, అంగన్వాడీలు, ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయినిలపై ఉందని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం చింతపల్లి మండలంలో సుడిగాలి పర్యటన చేసిన ఆమె ముందుగా అన్నవరం పంచాయతీలోని సోమవరం, అన్నవరం, కిన్నెర్ల, రింతాడ అంగన్వాడి కేంద్రాలను పరిశీలించి రికార్డులు పరిశీలించారు. అనంతరం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. గర్భిణీలు, పిల్లల బరువులను తూసే తూనిక యంత్రాలను అంగన్వాడీలకు పంపిణీ చేశారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ వసతి గృహ పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక చిల్డ్రన్స్ హోమ్ (బాలసదనం) వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాల్య వివాహాలను అవగాహనతోనే నియం త్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడి పిఒ రమణి, ఏసిడిపిఒ రామలక్ష్మి, బాలికల ఆశ్రమ వసతిగృహ అధికారిని నూక రత్నం, ప్రధానోపాధ్యాయుడు కొండలరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సత్యవతి, గౌరీ, అప్పలనరస, బాలసదనం వసతి గృహ అధికారిని సిహెచ్ వరలక్ష్మి పాల్గొన్నారు.

అడపవలసలో తాగునీటి ఎద్దడి

మరమ్మతుకు గురైన గ్రావిటీ పథకం
ఆరు నెలలైనా పట్టించుకోని అధికారులు
తీవ్ర ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

ఊట గెడ్డలో నీటిని సేకరిస్తున్న అడపవలస గ్రామస్తులు

మరమ్మతుకు గురైన గ్రావిటీ మోటారు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో గ్రావిటీ తాగునీటి పథకం మరమ్మతుకు గురవడంతో గ్రామస్తులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రావిటీ పథకం మోటర్ మరమత్తుకు గురై సుమారు 6 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. దీంతో, ఆ గ్రామస్తులు ఆరు నెలల నుంచి తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించు లేదని గ్రామస్తులు తెలిపారు. తాగునీటి కోసం డబల్ లైన్, రెండు రైల్వే ట్రాక్‌లను దాటుకుని పెద్ద గెడ్డను ఆశ్రయించి కలుషితమైన నీటిని సేకరించి ఉపయోగిస్తూ పలు రకాల వ్యాధుల బారిన పడుతున్నామని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేసి వినతి పత్రాలు సమర్పించినా అధికారులు స్పందించ లేదని గ్రామస్తులు తెలిపారు.తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి గ్రావిటి మోటార్ మరమ్మతు చేసి తాగునీటి పథకాన్ని పునరుద్ధరించాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీటి సమస్యపై ఆందోళన

ఆందోళన చేస్తున్న అడపవలస గ్రామస్తులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:సాగర్ పంచాయతీ అడపవలస గ్రామంలో గ్రావిటీ తాగునీటి పథకాన్ని మరమ్మతు చేసి వెంటనే సురక్షిత తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామస్తులు, గ్రామ మహిళలు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు టి.సూర్యనారాయణ మాట్లాడుతూ, గ్రామంలో గత ఆరు నెలల నుంచి గ్రావిటీ మోటార్ మరమ్మతుకు గురవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఏర్పడిందన్నారు. పలుమార్లు పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం పిఒపిఆర్డి అర్జున్ రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు , మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని గిరిజనుల ఆందోళన

డోలీ మోతలతో వినూత్న నిరసన

డోలి మోతలతో ఆందోళన చేస్తున్న గిరిజనులు, మద్దతు నిలిచిన గంగరాజు

ప్రజాశక్తి- అనంతగిరి:గ్రామాల్లో రోడ్డు, విద్యుత్, సాగు భూములకు రక్షణ, అక్రమంగా మ్యుటేషన్లు చేసుకున్న భూస్వాములపై చర్యలు తీసుకోవాలని సిపిఎం ఆధ్వర్యాన గిరిజనులు ఆందోళన నిర్వహించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యాలయం వద్ద గంటసేపు సిపిఎం నేతలు, గిరిజనులు నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి గంగరాజు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావులు మాట్లాడుతూ, మంజూరైన రోడ్డు పనులు వెంటనే పూర్తి చేసి, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. గిరిజనుల సమస్యలపై అనేక సార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని విమర్శించారు. బూరుగ, చినకోనేల గ్రామాల్లో గిరిజనుల భూములను అక్రమ రిజిస్ట్రేషన్ భూ స్వాములు చేసుకున్నారన్నారు.భూముల విషయం లో అవకతవకలకు పాల్పడిన తహశీల్దార్, సంబం ధిత రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసు కోవాలన్నారు.కరకవలస గిరిజనులకు పట్టా పాసు పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భయ భ్రాంతులకు గురి చేస్తున్న మిలటరీ మాజీ సైనికుల నుండి రక్షణ కల్పించాలన్నారు. చినకోనేల, బూరుగ గ్రామాల గిరిజనులకు కరెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పినకోట పంచాయతీ బల్లగరువు నుండి దాయార్తి మీదుగా మద్రేబు, తున్సీభ వరకు రోడ్డు పనులు త్వరితగతిన పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పిఒ, జాయింట్ కలెక్టర్లకు విన్నవించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టోకురు సర్పంచ్‌లు కిల్లో మోస్య, స్థానిక సర్పంచ్ ఎస్.రూతు, సిపిఎం మండల కార్యదర్శి సోమెల, నాగులు, గిరిజన సంఘం కార్యదర్శి జన్ని సుబ్బారావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని రేషన్ బియ్యం పక్క దారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా డీఎస్ఓ శ్యామ్ కుమార్ హెచ్చరించారు. మండలంలోని మొట్టుజోరు పంచాయతీ తడిగిరి గ్రామానికి రేషన్ బియ్యంను జన్ని సుబ్బారావు అనే వ్యక్తి అక్రమంగా తరలిస్తున్నాడు. పక్కా సమాచారం అందడంతో ఆటోతో పాటు సుబ్బారావుని తడిగిరి గ్రామంలో ఆయన ఇంటి వద్ద పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు, ఆటో తో పాటు 27 బియ్యం బస్తాలు సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.చుట్టుపక్కల గ్రామాల్లో కిలో బియ్యం రూ.14లకు కొనుగోలు చేసి రూ.20లకు ఒడిశా రాష్ట్రంలో అమ్ముతున్నట్లు తెలిపారు. పట్టుకున్న రేషన్ బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే కఠినమైన చర్యలు తీసుంటామని శ్యామ్ కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సిహెచ్‌డబ్ల్యులు

సిహెచ్‌డబ్ల్యులను ఆశావర్కర్లుగా గుర్తించాలి

- ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మికి వినతిపత్రం

ప్రజాశక్తి-పాడేరు:ఏజెన్సీలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల (సిహెచ్‌బ్ల్యు)లను ఆశా వర్కర్లుగా గుర్తించాలని కోరుతూ శుక్రవారం పాడేరులో ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి కి పలువురు సిహెచ్‌డబ్ల్యులు వినతిపత్రం అందజేశారు. గతంలో ఇచ్చిన హామీ అమలు చేయాలని, కొత్తగా ఇచ్చిన నోటిఫికేషన్‌లో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని కోరారు. గతంలో అధికారులకు అనేకమార్లు విన్నవించుకున్నప్పటికీ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌లను ఆశాలుగా గుర్తించడానికి చర్యలు చేపట్టలేదని ఎమ్మెల్యేకు వివరించారు. గతంలో అధికారులను కలిసినప్పుడు కొత్త నోటిఫికేషన్‌లో గత ఏడు సంవత్సరాల నుంచి చేస్తున్న వారికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పి నోటిఫికేషన్ లో కేవలం 53 ఖాళీల వరకు మాత్రమే చూపించారన్నారు. 36 పీహెచ్‌ఏల పరిధిలో సుమారుగా 750 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా మారుమూల గ్రామాలలో పని చేస్తున్నామని పేర్కొన్నారు. ౦ సమాన పనికి సమాన వేతనం, యూనిఫామ్, సెల్ ఫోన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మంగమ్మ, బేబీరాణి, కొండమ్మ, రాజీ, సుందరమ్మ, సీత, దలిమ్మ, రాధమ్మ, బీమాలమ్మ పాల్గొన్నారు.

రుణాలు సక్రమంగా చెల్లించండి

ట్రైకార్ డిజిఎం కెఎస్ ప్రభాకరరావు

ప్రజాశక్తి -పాడేరు: ట్రై కార్ సంస్థ నుండి వివిధ రకాల యూనిట్లు నెల కొల్పడానికి తీసుకున్న రుణాలను లబ్ధిదారుల సకాలంలో తిరిగి చెల్లించాలని ట్రైకార్ డిజిఎం కేఎస్ ప్రభాకర్‌రావు సూచించారు. శుక్రవారం పాడేరు, పెదబయలు మండలాల్లో పర్యటించి ట్రైకార్ ఆధ్వర్యంలో మంజూరు చేసిన యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ, యూనిట్ ఇవ్వడంతో ఏ విధంగా లబ్ధి చేకూరిందని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు క్రమం తప్పకుండా వాయిదాలు సక్రమంగా చెల్లించాలని వాహనాలను సక్రమంగా వినియోగించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. స్వయం ఉపాధి పథకాలను సక్రమంగా వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కోవిడ్ కారణంగా 2 సంవత్సరాలు వ్యాపారం జరగలేదని అందుచేత వాయిదాలను పెంచాలని లబ్ధిదారులు కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం పెదబయలు గ్రామంలో భారత గ్యాస్ ఏజెన్సీని సందర్శించారు. ఈ కార్యక్రమంలో కాఫీ ఏడి అశోక్, షెడ్యూల్ ట్రైబల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ట్రైకార్) ఐ.టి.డి.ఏ సిబ్బంది ఎన్.సీతారామయ్య, వంతల లక్ష్మయ్య లబ్ధిదారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని అంతర్ల గ్రామంలో మినీ అంగన్వాడీ కార్యకర్త కవడం లింగేశ్వరి (38) శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన లింగేశ్వరి గత రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతుంది. విశాఖలోని కింగ్ జార్జి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని విశాఖ నుంచి అంతర్లకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఐసిడిఎస్ సిడిపిఒ రమణి, సిబ్బంది కుటుంబాన్ని పరామర్శించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి 17వ వార్డు పరిధి ఇసుకతోట, శివాజీపాలెం, నేతాజీ పార్కు తదితర ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు ఎంపీ ఎంవివి సత్యనారాయణ, వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్యతో కలిసి మేయర్ గొలగాని హరివెంకటకుమారి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగర ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు కల్పనే జగనన్న ప్రభుత్వం లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో విశాఖ నగరం ఎంతో అభివృద్ధి సాధించిందని తెలిపారు. 17వ వార్డు పరిధి ఇసుక తోటలో సుమారు రూ.48.53 లక్షల వ్యయంతో బిటియల్ గ్రౌండ్ నిర్మాణానికి, శివాజీపాలెంలో సుమారు రూ.8.30 లక్షల వ్యయంతో గ్రౌండ్ ప్రహరీ నిర్మాణం, సుమారు రూ. 17.19 లక్షల వ్యయంతో నేతాజీ పార్క్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు.

ఇంటీరియర్ మెటీరియల్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్ (ఐఐఎ) ఆధ్వర్యాన బీచ్ రోడ్డులోని నోవాటెల్ హోటల్లో ఈ నెల 3, 4, 5 తేదీలలో నిర్వహిస్తున్న ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ మెటీరియల్స్ ప్రదర్శనను శుక్రవారం విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం ఐఐఎ విశాఖపట్నం సెంటర్ ఛైర్మన్ రాజేష్ నాగుల మీడియాతో మాట్లాడుతూ, ఐఐఎ విశాఖపట్నం కేంద్రం గత 17 సంవత్సరాలుగా ఈ ఎగ్జిబిషను నిర్వహిస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ సంబంధిత మెటీరియల్‌ను ప్రదర్శనలో ఉంచినట్లు చెప్పారు. ఈ ప్రదర్శన వేసవి బిల్డింగ్ సామగ్రిని ప్రదర్శించడమే కాక నిర్మాణ రంగంలో ఇటీవల వస్తున్న వినూత్న మార్పులు, సాంకేతిక పరిణామాలు గురించి, వృత్తిపరమైన నిపుణులు, ఔత్సాహికులకు ఒక వేదిక పై తెలియచేసేందుకు చర్యలు జరిపే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మూడురోజుల పాటు నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో 60 పైగా స్టాల్స్ ఏర్పాటు చేశామని, 40కి పైగా ఎగ్జిబిటర్స్ ఈ ప్రదర్శనలో ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో దినసరి చేసుకున్న మార్బుల్స్ నుంచి విలాసవంతమైన సరసమైన మాడ్యులర్ ఫర్నిచర్, గృహోపకరణాలు, ఇంటి ఆటోమేషన్ పరిష్కారాలు, విద్యుత్ దీపాలు, ఎయిర్ కండిషనింగ్, ఆధునిక బాత్ రూమ్ ఫిట్టింగ్స్, ఉపకరణాలు, ఎలివేషన్ క్లాడింగ్ మెటీరియల్స్, ఇంకా ఎన్నో రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

25 నుంచి వైజాగ్ జూనియర్ థియేటర్ ఫెస్ట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : లిట్ లాంటర్న్ ఫర్ కల్చర్, లిటరేచర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన వైజాగ్ జూనియర్ థియేటర్ ఫెస్ట్ (వి జెటిఎఫ్) రెండవ ఎడిషన్‌ను ఈ నెల 25, 26, 27 తేదీలలో వియంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. సిరిపురంలోని వీడీఏ పార్క్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో స్పాన్సర్, సిఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, ప్రముఖ వ్యాపారవేత్త మల్లిక్ కంకటాల పాల్గొని కార్యక్రమ వివరాలు మీడియాకు తెలిపారు. ఈ ఫెస్ట్ 4 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లల కోసం రూపొందించినట్లు చెప్పారు. ఇది పిల్లలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని అందిస్తుందన్నారు. ఇందులో ప్రొఫెషనల్ థియేటర్ గ్రూప్- స్వతంత్ర థియేటర్ ఆర్‌కె.నారాయణ్ రచించిన మాల్గుడి డేస్ కథలు, ముంబాయికి చెందిన కిట్టెక్ మ్యాన్షన్ క్వర్క్‌లైన్ ఫర్ ఆర్ట్స్, ఆర్టిస్టుల సహకారంతో తారాస్ థియేటర్ ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. తెలుగు మీడియం విద్యార్థులకు బాగా అర్థమయ్యేలా, థియేటర్ అనుభవాన్ని పొందేలా తెలుగు నాటకం ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ ఈవెంట్ టికెట్ ధర రూ.150 అని, విఐపి టిక్కెట్లలో తనిష్క్ స్పోర్టాలో కొనుగోలు చేసుకోవచ్చని వివరించారు. మరిన్ని వివరాలకు www.litlantern.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల వారు ప్రియ 9866628484, సోనల్ 9985122022, సంధ్య 9849114005ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో లిట్ లాంటర్న్ ఫర్ కల్చర్, లిటరేచర్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి సంధ్యా గోడే, ప్రియ ఉప్పలపాటి పాల్గొన్నారు.

సిపిఎం ప్రజా రక్షణ భేరి సభకు తరలిరండి

గ్రామాల్లో విస్తృత ప్రచారం

చింతూరులో సిపిఎం నేతల ప్రచారం

విఆర్.పురంలో పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-చింతూరు : లౌకికవాదం ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రజా రక్షణ భేరి పేరుతో సిపిఎం చేపట్టిన బస్సు యాత్ర ఈ నెల 5న చింతూరు వస్తుందని, ఈ సందర్భంగా జరుగు బహిరంగ సభకు తరలిరావాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని ఏడుగురాళ్లపల్లి, కొత్త కొత్తూరు, తుమ్మల గ్రామాలలో శుక్రవారం జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్, శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని, అయినా రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు బిజెపి పల్లకీ మోయడం దారుణమన్నారు. ఆ పార్టీలను ప్రశ్నించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఎం మండల నాయకులు మల్లం సుబ్బమ్మ, మొరం రంగమ్మ, కడియం లక్ష్మణ్, ముట్టం రాజయ్య, మడకం నంద, సోడె పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

విఆర్ పురం : సిపిఎం ప్రజా రక్షణ భేరిపై మండలంలోని శ్రీరామగిరి పంచాయతీ పరిధి చొక్కనపల్లి గ్రామంలో విస్తృత ప్రచారం చేశారు. సిపిఎం నాయకులు తోడం రాజు అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ బస్సు యాత్ర ఈనెల 5న విఆర్ పురం వస్తుందని, బస్సుయాత్ర విజయవంత చేయాలని పిలుపునిచ్చారు. జీవో నెంబర్ 3ను పునరుద్ధరించాలని, గిరిజన స్పెషల్ డిఎస్సి ద్వారా పోస్టులు భర్తీ చేయాలని, పోడుభూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచులు పులి సీతమ్మ, సోడి బుబామ్మ, గొంది దారయ్య, సిపిఎం మండల కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు,(శ్రీరామగిరి శాఖ కార్యదర్శి గుండిపూడి లక్ష్మణరావు, నాయకులు ఆత్మకూరి కాంతారావు పాల్గొన్నారు.

కూనవరం : సీపీఎం బస్సు యాత్ర ఆదివారం మండలానికి వస్తుందని, దానిని విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో బస్సు యాత్రపై కరపత్ర ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ రాష్ట్రానికి ద్రోహం చేస్తుందని, రానున్న ఎన్నికల్లో బీజేపీని దేశ వ్యాప్తంగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కూనవరంలో

కొయ్యూరు : ఈనెల 4వ తేదీన మండలానికి వస్తున్న ప్రజారక్షణ భేరి యాత్రను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు ఎస్ సూరిబాబు కోరారు. శుక్రవారం బస్సు యాత్రపై విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఎండగట్టేందుకే ప్రజారక్షణభేరి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సిపిఎం మండల నేతలు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

విఆర్.పురం : సిపిఎం ప్రజా రక్షణ భేరి వాల్ పోస్టర్‌ను మండల కేంద్రంలో శుక్రవారం సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ బస్సు యాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపనిచ్చారు. సిపిఎం నేత పంకు సత్తిబాబు, జి లక్ష్మణరావు, ప్రకాష్‌రావు, సుబ్బారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

600 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

బెల్లం పులుపు పట్టుకున్న పోలీసులు

ప్రజాశక్తి -కొయ్యూరు మండలంలోని చీడిపాలెం గ్రామ సరిహద్దు ప్రాంతంలో నాటుసారా తయారీ బట్టీలపై దాడులు నిర్వహించి 600 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం చేశామని కొయ్యూరు ఎస్సై రాజారావు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బంది, ఏపీఎస్పీ సిబ్బందితో కలిసి శుక్రవారం చీడిపాలెం గ్రామ శివారులలో ఉన్న నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ దాడుల్లో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం పులుపుతో పాటు, నాటుసారా తయారు చేసే బట్టీలను, వంట సామాగ్రిని, నాటుసారా నిల్వ ఉంచే డ్రమ్ములను ధ్వంసం చేశామని చెప్పారు. దొడ్డవరం గ్రామానికి చెందిన తంటపురెడ్డి వీర్రాజు నాటుసారా తయారు చేస్తున్నట్లు గుర్తించామని, త్వరలో అతన్ని అరెస్ట్ చేస్తామని స్పష్టం చేశారు. ఎవరైనా నాటుసారా తయారీ, క్రయ విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజారావు హెచ్చరించారు.

8న అత్యవసర సమావేశం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఈనెల 8న అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో లాలం సీతయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో 15వ ఆర్థిక సంఘం నిధులు, పనుల పురోగతి, మండల జనరల్ బాడీ మీటింగ్ల ఏటీఆర్‌లు, గ్రామ పంచాయతీ ఎన్నికల డిపాజిట్లు తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందని, అధికారులు, కార్యదర్శులు కచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-మోతుగూడెం :చింతూరు మండలం మోతుగూడెం జెడ్‌పి హైస్కూల్, వై.రామవరం మండలం డొంకరాయి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఎల్ఎస్‌హెచ్ఇఎస్ ఎస్ఐ పివి.సూర్యమోహన్‌రావు ఆధ్వర్యాన 'సే నో టూ కరప్షన్ బి కమిటీ టూ ది నేషనల్' అనే అంశంపై శుక్రవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయలు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏషియన్ రోలర్ స్కేటింగ్‌లో క్షేత్రకు రజతం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అక్టోబర్ 18 నుంచి 28వ తేదీ వరకు చైనాలో జరిగిన 19వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో విశాఖకు చెందిన శివకోటి క్షేత్ర (12) క్యాడెట్ విభాగంలో ఆర్టిస్టిక్ పెయిర్ స్కేటింగ్‌లో రజత పతకం గెలుచుకుంది. విశాఖ తిరిగి వచ్చిన నేపథ్యంలో ఆమె తండ్రి సావిత్రి హోమియోపతి క్లినిక్ వైద్యులు ఎస్.మురళీకృష్ణ శుక్రవారం సాయంత్రం ఎంవిపి కాలనీలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశం పలు వివరాలను వెల్లడించారు. ఎంవిపి కాలనీకి చెందిన జాతీయ స్కేటింగ్ కోచ్ సత్యం, శివాజీ పార్క్ స్కేటింగ్ అసోసియేషన్ చిట్టి బాబు ఆధ్వర్యాన 8 సంవత్సరాలుగా తమ కుమార్తె శిక్షణ పొందుతోందని తెలిపారు. ఎంవిపి కాలనీ లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న శివకోటి క్షేత్ర ఇప్పటివరకు 13 రాష్ట్ర స్థాయి పతకాలు, 10 జాతీయ స్థాయి పతకాలు గెలుచుకుందని వివరించారు.

5న ఆర్యవైశ్య యువజన సంఘం స్వర్ణోత్సవం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆర్యవైశ్య యువజన సంఘం స్వర్ణోత్సవాన్ని ఈ నెల 5వ తేదీన అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు నల్లూరి నూకరాజు తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పైడా గ్రూపు విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్ హాజరుకానున్నారని తెలిపారు. విద్యారంగంలో ప్రతిభ చూపిన ఆర్యవైశ్య విద్యార్థులను సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్యులను విద్యారంగంలో ప్రోత్సహించడం, స్త్రీలను స్వావలంబనగా అభివృద్ధి చేయడం ఈ సంఘం ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి గ్రంధి దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రెటరీ కెవి.రమణ పిఆర్ఒ వి.బాబూరావు పాల్గొన్నారు.

బిర్సా ముండా జయంతి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రంపచోడవరం :ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీలలో పాడేరులో నిర్వహించే జాతీయ స్థాయి బిర్సా ముండా 149వ జయంతి వేడుకలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను జెఎసి నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ ఈ సందర్భంగా నిర్వహించే సదస్సులో దేశంలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై దేశవ్యాప్తంగా పనిచేస్తున్న ఆదివాసీ సంఘాలు, సంస్థలు, మేధావులు అందరూ కలిసి తమ తమ అనుభవాలను పంచుకుంటారని తెలిపారు. సదస్సు వచ్చే వారు 6305911785, 9440778304 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు సోళ్ల బొజ్జి రెడ్డి, ముర్ల బాలు రెడ్డి, కారం రామన్న దొర, చవలం శుభ కృష్ణ దొర పాల్గొన్నారు.

దేశీయ ఔషధ రంగంలో మార్పులు

గీతం సదస్సులో డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ రామకిషన్

ప్రజాశక్తి- మధురవాడ : దేశ ఔషధ రంగంలో నాణ్యత ప్రమాణాలను పెంచడానికి ప్రభుత్వం మార్పులకు శ్రీకారం చుట్టిందని డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ డాక్టర్ ఎ.రామకిషన్ అన్నారు శుక్రవారం. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ ఫార్మశీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫార్మాబజ్ జాతీయ సదస్సులో మాట్లాడుతూ, ఏటా 12 శాతం మేర వృద్ధి సాధిస్తూ, దేశంలో ఔషధ ఉత్పత్తులు 50 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని, ప్రపంచంలో ఔషధ ఉత్పత్తిలో భారత్ 12వ స్థానంలో ఉందన్నారు. పపంచంలోని 205 దేశాలకు భారత్ ఔషదాలను ఎగుమతి చేస్తోందన్నారు. కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) ప్రొఫెసర్ బి.గీతాంజలి మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాలతో భారత ఔషధ పరిశ్రమ తక్కువ వ్యయం అయ్యే జనరిక్ ఔషధాలను తయారుచేసి, వివిధ దేశాలకు ఎగుమతి చేస్తోందన్నారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ మాట్లడుతూ ఇతర దేశాల నుంచి భారత్‌లో వైద్య పరీక్షలు, చికిత్సకు వస్తున్న వారి సంఖ్య క్రమేపి పెరుగుతూ మెడికల్ టూరిజంగా అభివృద్ధి చెందుతోందన్నారు.. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్‌దాస్ మాట్లాడుతూ ఔషధ ఉత్పత్తిలో దేశం గణనీయ వృద్ధి ఉన్నా, ప్రపంచ వాణిజ్యంలో వెనకబడి ఉందన్నారు. యువతరం నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో యాస్పైర్ పరిశ్రమ డైరక్టర్ డాక్టర్ సుబేందు సాహ, శ్రీకృష్ణ ఫార్మా ఉపాధ్యక్షుడు డాక్టర్ పిఎమ్.కృష్ణ ప్రసాద్, క్రీస్ట్ విశ్వవిద్యాలయం రీసెర్చి డైరక్టర్ ప్రొఫెసర్ గురుమూర్తి హెగ్డె, గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజా, ప్రొఫెసర్ రామారావు, ప్రొఫెసర్ శివకుమార్, ప్రొఫెసర్ శ్రీనివాస్ ప్రసంగించారు.